క్లుప్తంగా

ఎన్‌సీసీ విద్యార్థులకు ధృవపత్రాలు

చిట్వేలి : ఎన్‌సీసీ విద్యార్థులకు తిరుపతిలో ఇస్తున్న శిక్షణ పూర్తయింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఓ కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులకు ధృవపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి శిక్షణ పొందిన విద్యార్థినులు లక్ష్మీ, త్రివేణి, నందిని, లోహితలను పాఠశాల సిబ్బంది అభినందించారు. ఎన్‌సీసీ అధికారి పి.రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఓపీకి అభినందనలు

రామాపురం : రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జల్లా సుదర్శన్‌రెడ్డిని గురువారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, ఉమ్మడి కడప జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి రాచపల్లి ధర్మారెడ్డిలు కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. రాష్ట్రంలో పలు కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, ధర్మారెడ్డిని జల్లా సుదర్శన్‌రెడ్డి దుశ్శాలువాలతో సన్మానించారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఎర్రబల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకను ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బిల్లా హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్‌రాజు, జిల్లా కార్యదర్శి రమణయ్య, మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, కోశాధికారి శివయ్య, గౌరవాధ్యక్షులు కె.పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక

ఓబులవారిపల్లె : పుల్లంపేట మండలం టి.కమ్మపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కొండేటి సంధ్యారాణి క్రీడా విభాగంలో నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు క్రీడా ఉపాధ్యాయుడు అబ్దుల్లా గురువారం తెలిపారు. అబ్దుల్లా మాట్లాడుతూ క్రీడల్లో రాణించడంతోపాటు చదువుల్లో రాణించి సంధ్యారాణి ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిందన్నారు. ఇందుకు పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీటి సమస్య పరిష్కారం

చిన్నమండెం : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలు ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో చాకిబండ గ్రామం కురవపల్లెలో తాగునీటి సమస్య ఉందని స్థానిక ప్రజలు చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్‌లు బోరుకు మోటారు, పైపులు వేసి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పొలంబడి

పెనగలూరు : మండలంలోని కోడిచెన్నయ్యగారిపల్లెలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్ తెలిపారు. గత కొద్దిరోజులుగా మండలంలో అధిక ఉష్ణోగ్రతలు వల్ల వరిపొలంలో నులిపురుగుల ఉధృతి అధికమై ఆకులపై తెల్లని చారలు లాంటి మచ్చలు పడి ఎండిపోతున్నాయన్నారు. వాటికి నిర్మూలనకు చేయాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వీర జవాన్ల సేవలు స్ఫూర్తిదాయకం

సంబేపల్లె : వీర జవాన్ల సేవలు స్ఫూర్తిదాయకమని ఎంపీడీఓ నరసింహులు, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథరెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని శెట్టిపల్లె, పెద్దబిడికి, చిన్న బిడికి, అడవికమ్మపల్లెలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. ఏపీఓ రెడ్డిజవహర్, నాయకులు రమేశ్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆనంద్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్రమణనాయక్ పాల్గొన్నారు.

కోనయ్యగారిపల్లిలో నాభూమి – నాదేశం

పుల్లంపేట : ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేపట్టిన నాభూమి – నాదేశం కార్యక్రమాన్ని మండల పరిధిలోని కోనెయ్యగారిపల్లి పంచాయతీలో సర్పంచ్ నాగా పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు.

నులిపురుగులను నులిపేద్దాం

రాజంపేట/లక్కిరెడ్డిపల్లె/సంబేపల్లె/గాలివీడు/రాయచోటి అర్బన్/రాజంపేట టౌన్ : నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయా మండలాల్లో అధికారులు విద్యార్థులకు గురువారం అల్బెండజోల్ మాత్రను వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ అవగాహనతో నులిపురుగులను నివారించవచ్చని తెలిపారు. నులిపురుగులతో చిన్నారులు, విద్యార్థులు వ్యాధుల బారిన పడటమే కాక దీర్ఘకాలిక రోగాలకు దారి తీస్తాయన్నారు. ముఖ్యంగా 0–18 సంవత్సరాలలోపు పిల్లలపాటు 4 నెలలు నిండిన గర్భిణీ సైతం నులి పురుగుల నివారణ మాత్రలను విధిగా వేసుకోవాలని సూచించారు. అందరం కలిసికట్టుగా నులి పురుగులను నులిపేద్దామని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలల విద్యార్థులకు నులి పురుగుల మాత్రను స్వయంగా వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటికి తీసుకెళ్లి చిన్నారులను గుర్తించి వారికి నులి పురుగుల మాత్రను వేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య శాఖ జిల్లా స్థాయి అధికారులు, పీహెచ్‌సీ వైద్యులు, పాఠశాలల ఉపాధ్యాయులు గర్భిణులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యం.. సర్కారు ప్రాధాన్యం

- రూ. 6 కోట్లతో పూర్తయిన ఆస్పత్రి నిర్మాణం
- 24 గంటలపాటు ప్రజలకు వైద్య సేవలు
- మూడు మండలాల వారికి చేకూరనున్న లబ్ధి
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న 30 పడకల ఆసుపత్రి

సిద్దవటం : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వైద్యశాలను శుక్రవారం రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలు ప్రారంభించనున్నారు. పేదలకు మెరుగైన వైద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టింది. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం మండల కేంద్రంలోనే అత్యాధునిక సౌకర్యాలతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించింది. అందులో ప్రజా అవసరాల కోసం కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించింది. సిద్దవటం మండలంతోపాటు అట్లూరు, ఒంటిమిట్ట మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో డాక్టర్‌లు క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ వైద్య సేవలు అందించేవారు. కొన్నేళ్లుగా క్వార్టర్స్ దెబ్బతినడంతో వైద్యులు కడపలో నివాసం ఉంటూ ఆసుపత్రికి వచ్చి మధ్యాహ్నం వరకే వైద్య సేవలు అందిస్తున్నారు. రాత్రి వేళల్లో అత్యవసర చికిత్సలు రోడ్డు ప్రమాదాలు, సంభవించినప్పుడు చికిత్స కోసం కడప, రాజంపేట, బద్వేల్ ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో రోగులకు అధిక ఖర్చులు అవుతున్నాయి. మరి కొంత మంది సమయానికి వైద్యం అందక ప్రాణాలను కోల్పోతుండేవారు. ఇక నుంచి ప్రజలకు ఆ ఇబ్బందులు తొలగనున్నాయి. రాత్రివేళల్లో కూడా వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

కార్పొరేట్‌ను తలదన్నేలా సేవలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యతను ఇస్తోంది. సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాల ప్రజల అవసరాలను గుర్తించి సిద్దవటంలో రూ. 6 కోట్లతో 30 పడకల ఆసుపత్రిని నిర్మించింది. ఈ ఆసుపత్రిలో ప్రజలకు గైనకాలజీ, జనరల్ ఓపీ, వార్డులు, మైనర్, మేజర్ ఆపరేషన్లు, క్యాజువాలిటీ ఎక్స్‌రే, ల్యాబోరేటరీ, ఐసీయూ, మీటింగ్ హాలు, క్యాంటీన్, బయోవేస్టు, సెక్యూరిటీ రూమ్, జనరేటర్ సదుపాయం, అంబులెన్స్ గ్యారేజ్ వంటి సౌకర్యాలు రెండతస్తుల్లో నిర్మించారు. దీంతో మండల పరిసర ప్రాంతాల ప్రజలు తమ బాగు కాంక్షించే ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తమకు మంచి రోజులు వచ్చాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యం ఎంతో అవసరం



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి ఆరోగ్య శ్రీ వంటి పథకాలు ప్రవేశపెట్టగా ఆయన తనయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి నూతన ఆసుపత్రుల నిర్మాణాలతోపాటు మెరుగైన వైద్యం, ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. పేదల కోసం పని చేసే ప్రభుత్వం పది కాలాలు అధికారంలో ఉండాలి.

– నీరోళ్ల రామ్మోహన్, ఎగువపేట, సిద్దవటం

ప్రైవేటు వారు దోచుకుంటున్నారు



పేద ప్రజలు అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆసుపత్రికి వెళితే టెస్టులు, మందులు అంటూ పిప్పి చేస్తున్నారు. నూతన ఆసుపత్రి నిర్మాణంతో తమకు మంచి రోజులు వచ్చాయన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో దోపిడీని అరికట్టేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండల కేంద్రంలోనే వైద్య విధాన పరిషత్ కింద రూ.6 కోట్ల వ్యయంతో ఆసుపత్రిని నిర్మించడం హర్షనీయం.

– భవనాశి చిన్నబాబు, గాంధీ వీధి, సిద్దవటం

24 గంటలు వైద్య సేవలు



ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా సిద్దవటంలో 30 పడకల ఆసుపత్రి నిర్మించింది. ఆసుపత్రి ప్రారంభమైనప్పటి నుంచి పూర్తి స్థాయిలో వైద్యాధికారులు, సిబ్బంది నియామకాలతో 24 గంటలూ వైద్య సేవలను అందిస్తాం. ఇక్కడి ఆసుపత్రిలో ఎమర్జెన్సీ సేవలు, కాన్పులు వంటి వాటితోపాటు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

–డాక్టర్ మధుశేఖర్, వైద్యుడు, సిద్దవటం

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు


రైల్వేకోడూరు: పథకాలను వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం రైల్వేకోడూరు మండలంలోని మైసూరువారిపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, అవి అందుతున్నాయా లేదాఅని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో కులం, మతం, వర్గ, రాజకీయ విభేదాల్లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం జగనన్న సంక్షేమ పాలన సాగిస్తున్నామన్నారు. గడపగడపకు వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడిక్కడే సమస్యలను పరిష్కరించినట్టు తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకుండా జవాబుదారీతనంతో పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌ను 2024 ఎన్నికల్లో ఆదరించాలని కోరారు.

చందన్ సినిమాస్‌ను ప్రారంభించిన కొరముట్ల

పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులోని అత్యాధునిక హంగులతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర నూతన టెక్నాలజీతో నిర్మించిన చందన్ సినిమాస్ థియేటర్ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా కొరముట్ల హాజరై సినిమా థియేటర్‌ను ప్రారంభించారు.

కంప్యూటర్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోండి

ఓబులవారిపల్లె : విద్యారంగానికి ప్రభుత్వ పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం వైకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆల్ఫామెరైన్ ఎండీ దూడల సుధాకర్‌యాదవ్ సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను కొరముట్ల, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ విద్య వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొనిరావడం జరిగిందన్నారు. ఆల్ఫామెరైన్ ఎండీ సుధాకర్ యాదవ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు దాదాపు రూ. 90 లక్షల వ్యయంతో రైల్వేకోడూరు రెడ్డివారిపల్లె, ఓబులవారిపల్లె, వైకోట ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. అనంతరం దూడల సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చారన్నారు. ప్రస్తుత తరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అదృష్టవంతులని, వారికి ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా బోధనలు అందిస్తోందన్నారు. స్థానిక పీఈటీ అబ్దుల్లా జాతీయ స్థాయిలో క్రీడలలో జాతీయ స్థాయిలో శిక్షణ ఇస్తున్నాడని, ఆయన సహకారంతో సాఫ్ట్ బాల్‌లో స్థానిక పాఠశాల విద్యార్థులకు శిక్షణ అందిస్తామన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన కొరముట్ల

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన పాలకమండలి చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ని గురువారం తిరుమలలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

దశాబ్దాల కల సాకారం


ప్రొటెక్షన్ వాల్‌కు భూమి పూజ చేస్తున్న కొరముట్ల

ఓబులవారిపల్లె : దశాబ్దలుగా వైకోట గ్రామంలోని కాలువకు ప్రొటెక్షన్ వాల్ లేక వర్షాకాలంలో నీరు ఇళ్లల్లోకి ప్రవేశించి ప్రజలు ప్రతి ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్‌లు ప్రహరీ గోడకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ వైకోట గ్రామ ప్రజలు ప్రతి ఏడాది వర్షాకాలంలో వర్షపు నీటితో దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి సమస్యలు పరిష్కరించేందుకు సుమారు రూ. 1.60 కోట్లతో ప్రహరీ గోడను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా వైకోట గ్రామస్తుల కల ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల సహకారంతో సాకారం అయ్యిందన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

రాయచోటి అర్బన్ : రాయచోటి రూరల్ మండల పరిధిలో ఎన్నికలు నిర్వహిస్తున్న రెండు వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 7 నామినేషన్‌లు దాఖలైనట్లు రాయచోటి మండలం స్టేజ్ – 1 రిటర్నింగ్ అధికారి వెంకటశివారెడ్డి తెలిపారు. గొర్లముదివీడు గ్రామం 3వ వార్డుకు నిర్వహిస్తున్న ఎన్నికల్లో 3 నామినేషన్లు, శిబ్యాల గ్రామం 12వ వార్డుకు జరుగుతున్న ఎన్నికల్లో 4 నామినేషన్లు చొప్పున దాఖలయ్యాయని పేర్కొన్నారు. కాగా నామినేషన్ స్రూటినీ కార్యక్రమంలో 11వ తేదీ శుక్రవారం జరుగనుంది.

సిద్దవటం : మండలంలోని 4 గ్రామ పంచాయతీలలో 4 వార్డు మెంబర్‌ల స్థానాలకు ఉప ఎన్నికకు సంబంధించి గురువారం పలువురు నామినేషన్‌లు దాఖలు చేశారు. ఉప్పరపల్లె గ్రామ పంచాయతీలోని 10వ వార్డు మెంబరుగా వైఎస్‌ఆర్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థి అన్నిక నీలిమ తమ నామినేషన్‌ను దాఖలు చేసింది. అలాగే మేజర్ గ్రామ పంచాయతీ అయిన మాధవరం–1లోని 2వ వార్డు మెంబర్ స్థానాలకు టీడీపీ బలపరుస్తున్న అభ్యర్థులు బొడిచర్ల భాగ్యమ్మ, ఉప్పల వెంకటలక్ష్మిలు నామినేషన్‌ను వేశారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ రెండో వార్డుకు గురువారం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి చక్రేనాయక్ తెలిపారు. ఈనెల 14వ తేదీన నామినేషన్‌ల ఉపసంహరణ, 19న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు సాయంత్రం ఫలితాలు ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు.

పలు వార్డుల్లో ఒకే నామినేషన్

రాజంపేట రూరల్ : మదనగోపాలపురం పంచాయతీలోని 7వ వార్డును వైఎస్సార్‌సీపీ ఏకగ్రీవం చేసుకున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొండూరు విశ్వనాథరాజు గురువారం తెలియజేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఇదే వార్డులో పోటీ చేసి గెలిచిన పోలుబోయిన చిన్నపెంచలయ్య కరోనాతో మృతి చెందడంతో అక్కడ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నామినేషన్‌ల దాఖలు చేసేందుకు గురువారం సాయంత్రం వరకు మిత్తికాయల గురమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవం కానున్నది. నందలూరులో రెండు స్థానాలు

నందలూరు(రాజంపేట) : నందలూరులో మూడు పంచాయతీలలో ఖాళీగా ఉన్న మూడు స్థానాలకు ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా గురువారంతో నామినేషన్ల దాఖలుకు తెర పడింది. రెండు స్థానాలకు ఒకటే నామినేషన్ దాఖలు కావడంతో రెండు స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. ఇందులో లేబాక గ్రామ పంచాయతీలో మూడవ వార్డు నాగి వెంకటసుబ్బయ్య ఒక్కరే నామినేషన్ వేయగా, పాటూరు ఒకటవ వార్డు పసుపులేటి సౌజన్య ఒక్కరే దాఖలు చేశారు. దీంతో ఆమె ఎన్నిక కూడా లాంఛనం కానుంది. ఈమె స్వతంత్ర్య అభ్యర్థిగా నిలిచారు. కాగా పాటూరు పంచాయతీలో 10 వార్డుకు నామినేషన్ దాఖాలు చేయడానికి ఎవరు ముందుకురాలేదు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల, ప్రకాశ్ నగర్ కాలనీ పంచాయతీలలోని 4, 8 వార్డులకు సంబంధించి ఒక్కో నామినేషన్‌లు మాత్రమే దాఖలైనట్లు ఆర్ఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం నామినేషన్‌లకు చివరిరోజు కావడంతో మోటకట్ల 4వ వార్డుకు బి.రెడ్డమ్మ, పీఎస్‌కాలనీ 8వ వార్డుకు బి.సంగీతలు నామినేషన్ దాఖలు చేశారు. పోటీ ఎవరు లేకపోవడంతో అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించాల్సి ఉంది. కాగా శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానాలను అధికారులు ప్రకటించనున్నారు.

ప్రభుత్వ పాలనకు ప్రజల మద్దతు

గడప గడపకు మన ప్రభుత్వంలో రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


లబ్ధిదారుకు సంక్షేమ బావుటాను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనకు ప్రజలు వంద శాతం మద్దతు ఇస్తున్నారని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి రూరల్ మండలం చెన్నముక్కపల్లె – 1 సచివాలయ పరిధిలో జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, పోలు సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, సర్పంచ్ మమత, ఎంపీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటా తిరిగి పథకాల అమలును శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. రాజులకాలనీ, కొలిమిమిట్ట, వినాయకవీధి, పూలతోట దళితవాడలలో గడప గడపకు సందర్శిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరిస్తూ, అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో స్వర్ణయుగంగా జగన్ పాలన సాగుతోందన్నారు.

ఇంటింటా జననీరాజనం

చెన్నముక్కపల్లె–1 సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పండుగలా జరిగింది. గడప గడపనా శ్రీకాంత్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతాలు లభించాయి. గ్రామంలో ప్రజలు నీరాజనాలు పట్టారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రభుత్వ పని తీరు బాగుందా? పథకాల గురించి అడుగుతుంటే జగన్ పాలన బేషుగ్గా ఉందని ప్రజలు కితాబునిచ్చారు. అర్హత ఉంటే పథకాలు నేరుగా అందుతుండటం గొప్ప విషయమంటూ సంతోషంగా లబ్ధిదారులు శ్రీకాంత్‌రెడ్డికి తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె పార్టీ పరిశీలకులు హబీబుల్లాఖాన్, ఉపసర్పంచ్ కాలేషా, మురికినాటి వెంకటరామిరెడ్డి, బీసీ సెల్ విజయ భాస్కర్, తిరుపాల్‌నాయుడు, జాఫర్ అలీఖాన్, వెంకటరామిరెడ్డి, హరినాథరెడ్డి, శ్రీనివాసులు, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో విద్యా బోధనలు


ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : మండలంలోని ఆకేపాడు జెడ్పీ హెచ్ఎస్‌లో ఆధునిక పద్ధతులతో విద్యార్థులకు బోధించనున్నట్లు ఆ పాఠశాల హెచ్ఎం సీవీ.రమణయ్యశెట్టి తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో బోధనలు అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ)లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా గురువారం ఆకేపాడు జెడ్పీహెచ్ఎస్‌లో ఐఎఫ్‌పీని హెచ్ఎం ప్రారంభించారు.

మండలాభివృద్ధికి అందరూ సహకరించాలి

చిన్నమండెం : మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులతోపాటు మండల స్థాయి అధికారులందరూ సహకరించాలని మండలాధ్యక్షురాలు సుధామాధురి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీడీఓ రహీం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిల సహకారంతో మండలంలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత సచివాలయాల అధికారులపై ఉందన్నారు. అలాగే మండల అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పనుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఇటీవల ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో వచ్చిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. అనంతరం ఆమె మండల వ్యాప్తంగా ఉన్న 12 అంశాలపై శాఖలవారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులునాయుడు, మండల ఉపాధ్యక్షుడు ఏజాజ్ అలీఖాన్, కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌సాబ్, సర్పంచ్ మునల్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్యామ్, రమేష్, వెంకటప్పనాయుడు, రెడ్డప్ప, జయమ్మ, రమణ, సర్పంచులు నజీర్ అహమ్మద్, నజీర్‌బాషా, లక్ష్మిరెడ్డి, అఫ్రోజ్, జగన్నాదరెడ్డి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణలకు సహకరించండి

రాజంపేట : ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణారెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక ఆర్డీఓ సభా భవనంలో ఓటర్లు జాబితాపై అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఓటరు జాబితాపై వచ్చిన తొలిగింపులు, చేర్పులు, మార్పులు తదితర అంశాలకు సంబంధించి నకళ్లను అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు అందజేస్తున్నామన్నారు. వీటిలో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లోపాలు లేని ఓటరు జాబితా తయారుచేసేందుకు బీఎల్‌ఓలు, ఎన్నికల అధికారులు, రెవెన్యూ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తుంటారన్నారు. ఇందుకు రాజకీయపార్టీల నాయకులు సహకరించాలన్నారు. గతంలో బీఎల్‌ఓలు సక్రమంగా పనిచేయడంలేదనే ఫిర్యాదులున్నాయన్నారు. ఇప్పుడు వారందరిని మార్చివేసి వారి స్థానాల్లో కొత్తవారిని నియమించామన్నారు. సిబ్బంది చురుగ్గా పనిచేసి ఓటరు జాబితా సర్వేను వేగవంతం చేశారన్నారు.

గాలివీడు : ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన పక్కాగా జరిపి పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించాలని ఆర్డీఓ రంగస్వామి సిబ్బందిని ఆదేశించారు. గురువారం గాలివీడులో పర్యటించిన ఆయన ఓటరు జాబితా రూపకల్పనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన పక్కాగా నిర్వహించి ఓటర్ జాబితా సిద్ధం చేయాలన్నారు. అధికారులు అన్నీ సక్రమంగానే ఉన్నాయా, చనిపోయిన వారి పేర్లు, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను పరిశీలించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు నమోదుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో నిర్లక్ష్యం వహించే అధికారులపై ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పేరెంట్స్ మీట్

లక్కిరెడ్డిపల్లె/చిట్వేలి : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అసెస్మెంట్ పరీక్షలు నిర్వహించింది. పరీక్షల్లో విద్యార్థుల ఫలితాలను తల్లిదండ్రులకు తెలియజేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు తీసుకోవాల్సిన మెళకువలను ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు పాఠశాలకు పంపించి హోంవర్క్ ఇతర విషయాలు పర్యవేక్షణ చేసి పిల్లలు చెడు మార్గంలో వెళ్లకుండా సన్మార్గంలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

రామాపురం : మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం పంటకోత ప్రయోగాలపై రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఏఎస్ఓ నాగార్జున, వ్యవసాయాధికారి నాగమణిలు శిక్షణ ఇచ్చారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం

రాయచోటి అర్బన్ : విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహా అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంతో గురుకులాలు, కేజీబీవీలకు వెంటనే స్వంత భవనాలను నిర్మించాలన్నారు.